క్లుప్తంగా

ముఖ్యమంత్రి పుట్టినరోజు వేడుక ఘనంగా నిర్వహిద్దాం

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను నియోజకవర్గంలో గురువారం ఘనంగా నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి,గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, జేసీఎస్ కన్వీనర్‌లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు ఈ వేడుకను ఘనంగా నిర్వహించాలని సూచించారు. పట్టణం, గ్రామాల్లో ఉండే వైఎస్సార్‌విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించడం, జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాల వద్ద కేక్‌లు కట్‌చేయడం, మొక్కలు నాటడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

340 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు సిద్ధం



ఆర్.వెంకంపేట ఉపాధ్యాయులకు ట్యాబ్‌ల బాక్స్‌లను అందజేస్తున్న ఎంఈఓలు సూరిదేముడు, వెంకటరమణ

సీతానగరం: నూతన విద్యావిధానంలో వస్తున్న మార్పులకనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి అవసరమైన పరికరాలను ప్రభుత్వం సమకూర్చిందని ఎంఈఓ 1,2 జి.సూరిదేముడు, ఎంవీ రమణ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండల విద్యాశాఖ కార్యాలయానికి ప్రభుత్వం పంపించిన ట్యాబ్‌లను నిర్దేశించిన పాఠశాలల ఉపాధ్యాయులకు ఎంఈఓలు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 6 ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు, కేజీబీవీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గిరిజన ప్రతిభా విద్యాలయాల్లో 8 వ తరగతి చదువుతున్న 340 మందికి 340 ట్యాబ్‌లు ఈ నెల 21న పంపిణీ చేయడానికి సిద్ధం చేస్తున్నామని తెలియజేశారు.

మల్లి ఆశ్రమ పాఠశాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ లిల్లీరాణి

సీతంపేట: మల్లి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల టీఎల్ఎంలు, టీచింగ్ డైరీలు, బోధన తీరును పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. హెచ్ఎం పి.నారాయుడు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రూ.25 లక్షలతో తాగునీటి కుళాయిల ఏర్పాటు



వాటర్ ట్యాంక్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న ఏఈ సందీప్, రామారావు

భామిని: మండలంలోని దిమ్మిడిజోల గ్రామంలో జలజీవన్ మిషన్ కింద సుమారు రూ.25.65 లక్షల వ్యయంతో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ అలికాన సందీప్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వలరౌతు రామారావు తెలిపారు. దిమ్మిడిజోల– మాసగూడ మధ్య రక్షిత మంచి నీటి ట్యాంక్ ఏర్పాటుకు మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీ, బీసీ కాలనీల్లో ముందుగా తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. జేజేఎం కాంట్రాక్టర్ చిన్నారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రైనీ కలెక్టర్ పరిశీలన



రైస్‌మిల్లు సందర్శనలో ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్


మెంటాడ: మండలంలోని చల్లపేట, మీసాలపేట, ఉద్దంగి, కొంపంగి గ్రామ సచివాలయాలతో పాటు రైస్‌మిల్లులను ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ మంగళవారం సందర్శించి, వాటి పనితీరు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది పలు సూచనలు సలహాలు చేశారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని ఆర్‌బీకే సిబ్బందికి సూచించారు. చల్లపేటలోని రైస్‌మిల్లు యజమానితో మాట్లాడిన ఆయన రైతులను ఇబ్బంది పెట్టకుండా చూడాలన్నారు. అలాగే ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో మాట్లాడి, పథకాలు ఎలా అందుతున్నాయని అడిగారు. వారంతా సక్రమంగా అందుతున్నాయి. పాలన బాగుందని అన్నారు.

ఏజెన్సీలో చలిగింత



పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన దుకాణం

- సందడి చేస్తున్న ఉన్ని దుస్తుల వ్యాపారం
- చలిని తట్టుకునేందుకు కొనుగోలుకు ఎగబడుతున్న ప్రజలు





పార్వతీపురంటౌన్: మన్యం ప్రాంతంలో రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో మార్కెట్‌లోకి అందమైన స్వెటర్లు వచ్చేశాయి. రకరకాల రంగులలో.. ఆకర్షించే డిజైన్లలో టిబెటన్లు తీసుకువచ్చిన ఉన్ని దుస్తుల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లా వాసులను చలిపులి వణికిస్తోంది. సాయంత్రం 6 గంటలకే చల్లని గాలులు వీస్తున్నాయి. శీతాకాలం వస్తూ వస్తూ జిల్లా వాసులకు వెచ్చని నేస్తాలను తీసుకువచ్చింది. చలిని పారదోలేందుకు ఉన్ని దుస్తులతో టిబెటన్లు ఇక్కడికి వచ్చి వాలిపోయారు. దాదాపు వంద రోజుల పాటు ఇక్కడే ఉండి, ఇక్కడి ప్రజలతో మమేకమై తమ వ్యాపారాన్ని సజావుగా చేసుకుని వెళ్లిపోతారు. శీతాకాలం ప్రారంభంలోనే చలి ప్రభావం నుంచి తప్పించుకునేందుకు ప్రజలు ఉన్ని వస్త్రాలను ఆశ్రయిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వస్త్ర దుకాణాలు కళకళలాడుతున్నాయి. స్వెటర్లు కొనుగోలు చేయాలంటే ప్రజలు టిబెటన్ల దుకాణాల వద్దకు పరుగులు తీస్తున్నారు. వివిధ రకాల డిజైన్‌లతో స్వెటర్లు, టోపీలు, చేతి గ్లౌజ్‌లు శాలువాలు, రెయిన్‌కోట్లు, మంకీ క్యాప్‌లు, బెడ్‌షీట్లు, రగ్గులు విక్రయానికి పెట్టారు. చిన్న పిల్లల నుంచి పెద్దలవరకు వివిధ డిజైన్‌ల్లో అమ్మకాలు జోరందుకున్నాయి. ధరలు ఇలా ఉన్నాయి

స్వెటర్లు	రూ.400నుంచి రూ.1,300
రెయిన్‌కోట్లు	రూ.500నుంచి రూ.1,500
శాలువాలు	రూ.200నుంచి రూ.500
మంకీ కేప్‌లు	రూ.50నుంచి రూ.150
మఫ్లర్	రూ.50నుంచి రూ.200
గ్లౌజ్‌లు	రూ.100నుంచి రూ.200
బెడ్‌షీట్లు(రగ్గులు)	రూ.600

మన్యంలో పెరిగిన చలితీవ్రత

పార్వతీపురం: ఏజెన్సీలో రోజురోజుకు చలితీవ్రత పెరుగుతోంది. దట్టంగా పొగమంచు కురవడంతో పాటు చల్లని గాలులు వీస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో మన్యం వాసులు గజగజ వణుకుతున్నారు. పగటిపూట ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతోపాటు అర్ధరాత్రినుంచి పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 8గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. దీంతో వాహనదారులు హెడ్ లైట్ వేసుకుని వాహనాలను నడుపుతున్నారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో పొగమంచు ఎక్కువగా ఉంటుందని, దీనివల్ల రానున్న రోజుల్లో చలితీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. చలి తీవ్రతను తట్టుకోలేక గ్రామాల్లో చలిమంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు.



పార్వతీపురం: దట్టంగా కురుస్తున్న మంచు



పార్వతీపురం: చలికాగుతున్న ప్రజలు

ప్రారంభానికి సిద్ధంగా తామరఖండి రోడ్డు



పూర్తికావచ్చిన రోడ్డు

సీతానగరం: మండలంలోని తామరఖండి–బక్కుపేట గ్రామాల మధ్య జరుగుతున్న రోడ్డు పనులు పూర్తి కావస్తుండడంతో ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నామని పీఆర్ (ప్రాజెక్ట్స్) ఏఈ జి.శంకరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం రోడ్డును పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ రోడ్ల అభివృద్ధికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో ప్రభుత్వం కేటాయించిన జీజీఎంపీ నిధులు రూ.20 లక్షలతో 570 మీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తి కావచ్చిందన్నారు. అలాగే సీతానగరం మండలంలోని బూర్జ వద్ద నాబార్డ్ నిధులతో సువర్ణముఖినదిపై పాత బూర్జ రేవు మీవు మీదుగా–చినంకలాం, గాదెలవలస రేవు మధ్య రూ.9 కోట్లతో వంతెన నిర్మాణం, పార్వతీపురం మండలంలోని ములగ–డోకిశీల గ్రామాల మధ్య రూ.8.80 కోట్లతో బీటీరోడ్డు పనులు చేపట్టవలసి ఉందన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లు పిలవనున్నట్లు తెలియజేశారు.

ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

బలిజిపేట: ఈనెల 26వ తేదీన ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని సచివాలయాల స్థాయిలో విజయవంతం చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయం పరిధిలో క్రీడలకు సంబంధించి మైదానం, పోటీలకు అవసరమైన కోర్టును కేటాయించాలని, అందుకు పీఈటీలు అందుబాటులో ఉంటారని, కార్యదర్శులు సహకరించాలని చెప్పారు. ఎక్కువమంది పోటీలలో పాల్గొనే విధంగా చూడాలని సూచించారు. గ్రామస్థాయిలో ఉండే నాయకుల సహకారం తీసుకోవాలని సలహా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ–1సామల సింహాచలం, ఈఓపీఆర్‌డీ రవి, కార్యదర్శులు, పీఈటీలు పాల్గొన్నారు.

చురుగ్గా రహదారుల నిర్మాణం



మిర్తివలస–లింగాడవలస మధ్య జరుగుతున్న రోడ్డు పనులు



మక్కువ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి నక్కడవలసకు జరుగుతున్న రోడ్డు నిర్మాణం

సాలూరు: ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖమంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక కృషితో సాలూరు మండలంలో బీటీ రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పెదపథం పంచాయతీలో ఐటీడీఏ ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ఈ పనులు చేపట్టారు. సుమారు రూ.కోటి 20 లక్షలతో మిర్తివలస–లింగాడవలస మధ్య 1800 మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. మక్కువ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి నక్కడవలసకు 500 మీటర్ల మేరకు సుమారు రూ.40 లక్షలతో, అలాగే బాగువలస పీహెచ్‌సీ నుంచి నార్లవలసకు సుమారు రూ.80 లక్షలతో 1700 మీటర్ల రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని త్వరలోనే పనులు పూర్తిచేస్తామని అధికారులు చెబుతున్నారు. రహదారి కష్టాలను తొలగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యేక దన్యవాధాలు తెలియజేస్తున్నారు.

తోటపల్లి పంప్‌హౌస్ పరిశీలన



పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పురపాలక సంఘం పాలకవర్గం ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే జోగారావు తోటపల్లి ప్రాంత పరిధిలో గల పంప్‌హౌస్‌ను క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పధాన సమస్యలైన తాగునీరు, డంపింగ్‌యార్డు పరిష్కారానికి శాశ్వతంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మంచినీటి సరఫరాకు రూ.63.33కోట్ల నిధులు మంజూరు చేయగా రూ.3కోట్ల వరకు పనులు జరిగాయని, మిగిలిన పనులు పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. డంపింగ్ యార్డు ప్రధాన సమస్యను కూడా జిల్లా అధికారుల సహకారంతో త్వరలోనే పరిష్కరించనున్నట్లు చెప్పారు. తోటపల్లి మంచినీరు పంప్‌హౌస్ ప్రాంతంలో గల స్థలం అంతటికీ కంచెవేసి అవసరమైన చోట మొక్కలు నాటడం, అలాగే అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం తోటలో అందరితో కలిసి వనభోజనం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్‌చైర్మన్ కొండపల్లి రుక్మిణి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, వార్డు కౌన్సిలర్‌లు, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, అధికారులు, సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 16 మంది పయనం



నేత్ర శస్త్రచికిత్స కోసం విజయనగరం వెళ్తున్న రోగులు

గుమ్మలక్ష్మీపురం: నేత్ర శస్త్రచికిత్సకు ఎంపికైన 16 మంది మండల కేంద్రంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో మంగళవారం బయలుదేరారు. జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా చేపట్టిన వైద్య శిబిరంలో వీరంతా కెటరాక్ట్(అంతర కుసుమం), టెరీజియం(కొయ్యకుండ) వంటి కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించి, శస్త్రచికిత్సకు రిఫర్ చేయడం జరిగిందన్నారు. వీరందరికీ ఉచితంగా శస్త్రచికిత్స చేయించడంతో పాటు వసతి, భోజనం, కళ్లద్దాలు వంటి సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

చురుగ్గా ధాన్యం కొనుగోలు



వెంకటరాజపురం గ్రామం నుంచి రైస్‌మిల్లుకు తరలిస్తున్న ధాన్యంబస్తాలు

జియ్యమ్మవలస: మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చాలా చురుగ్గా జరుగుతోంది. మండలంలోని గవరమ్మపేట పంచాయతీ, వెంకటరాజపురం నుంచి 3 వేల ధాన్యంబస్తాలు మండలంలోని పలు రైస్‌మిల్లులకు చేరాయని వీఏఏ సోనియా, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఎం.వాసునాయుడు మంగళవారం తెలిపారు. కూలీలు, కోత మిషన్ల కొరత కారణంగా కొన్నిచోట్ల వరికోతలు కాలేదన్నారు. ఎక్కడ కోతలు జరిగినా వెంటనే రైతులను ఆశ్రయించి, ప్రభుత్వ ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ ప్రకటించిన మద్దతుధరకే ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతోందని, దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు తెలిపారు.

అంగన్వాడీ సిబ్బంది రిలేదీక్షలు

సీతానగరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ సిబ్బంది చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 8వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సీఐటీయూ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి వి. రామలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 8 రోజులుగా దీక్షలు చేస్తున్నారని, మంగళవారం దీక్షాశిబిరం వద్ద వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలియ జేశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పాడిరైతులకు మెరుగైన సేవలు



రైతులకు సూచనలు చేస్తున్న డీడీ జగన్నాథం

పాలకొండ: పాడిరైతులకు మెరుగైన సేవలందించేదుకు చర్యలు తీసుకున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ డీడీ జగన్నాథం అన్నారు. మండలంలోని కొండాపురం గ్రామంలోని వెటర్నరీ సెంటర్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. గ్రామంలో అందుతున్న పశువైద్య సేవలపై పాడిరైతుల వద్ద ఆరాతీశారు. ఏసీసీ రుణాలు కోసం అర్హత ఉన్న రైతులు పేర్ల నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం పాడి రైతులకు అందిస్తున్న పథకాలను వివరించారు. అర్హులైన వారంతా పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఏడీ పి.మాణిక్యరావు, వెటర్నరీ అసిస్టెంట్ వెంకటరమణ ఉన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డిప్యూటీ ఈఓ

పాలకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని డిప్యూటీ ఈఓ పల్రి కృష్ణమూర్తి సూచించారు. మండలంలోని ఓని ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. అకడమిక్ క్యాలెండర్ అమలు, విద్యార్థుల వర్క్‌బుక్స్, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాల హెచ్ఎం బి.నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



సీతానగరం: స్వామివారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని గోవింద మాలాధారణ చేసిన భక్తులు ప్రతి రోజూ వేకువజామున లేచి నగర సంకీర్తన చేయడంతో పాటు వేణుగోపాల స్వామివారిని పల్లకిలో ఊరేగిస్తూ అభిషేక పూజలు చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ మండల కేంద్రంలో గోవింద మాలాధారణ చేసిన భక్తులు వేకువజామున సువర్ణముఖి నదిలో స్నానాలు చేసి వేణుగోపాలస్వామిని దర్శించి ఆలయ ప్రాంగణంలో పల్లకిలో అధిష్ఠించిన స్వామిని మార్కెట్ మీదుగా హనుమాన్ జంక్షన్ (కిలోమీటర్ దూరం) వరకూ మేల్కొలుపు, నగర సంకీర్తనలతో తిరువీధి చేసి తిరిగి వేణుగోపాలస్వామి ఆలయానికి చేరుకుంటున్నారన్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులు వేణుగోపాల స్వామి, గోదాదేవి అమ్మవారికి పూజలు చేస్తున్నారని తెలిపారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



నైరేడ్‌లో శిక్షణార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాజాం: అందుబాటులో ఉన్న స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి యువతకు సూచించారు. స్థానిక పట్టణంలోని జీఎంఆర్ ఫౌండేషన్ నైరేడ్ నిర్వహిస్తున్న ఉచిత స్వయం ఉపాధి, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను ఆమె మంగళవారం పరిశీలించారు. జీఎంఆర్ వీఎఫ్, నాబార్డు సాయంతో ఇస్తున్న ఈ శిక్షణకు సంబంధించి, పలు అంశాలను అభ్యర్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శిక్షణార్థులతో కాసేపు మాట్లాడి, భోజనం, వసతి వంటి మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. కంప్యూటర్ ల్యాబ్, హోమ్ నర్సింగ్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్‌లు చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ శిక్షణ పొందిన అభ్యర్థులకు టూల్ కిట్లు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. నాబార్డు డీడీఎం నాగార్జున మాట్లాడుతూ గతేడాది కాలంలో కొత్త శిక్షణా కోర్సులు ఇచ్చేందుకు నాబార్డు ద్వారా రూ.60 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం శ్రీనివాసరావు, రీజనల్ మేనేజర్ నరేష్, జీఎంఆర్‌వీఎఫ్ జీఎం జయకుమార్, డైరెక్టర్ రాజేష్, ఏపీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.